క్లుప్తంగా

యూత్ కాంగ్రెస్ చేయూత..



ములుగు రూరల్: గుండ్ల వాగు వరద ఉధృతి కారణంగా నష్టపోయిన నేతాజీ కాలనీ వాసులకు యూత్ కాంగ్రెస్ నాయకులు మంగళవారం చేయూతనిచ్చారు. ఎమ్మెల్యే సీతక్క ఆదేశాల మేరకు గోవిందరావుపేట మండలం నేతాజీనగర్‌కు చెందిన 20 కుటుంబాలకు యూత్ అధ్యక్షుడు జక్కు రణధీప్ నిత్యావసర సరుకులను అందించారు. ఈ కార్యక్రమంలో శేఖర్, మధు, రేగుల రాజు, లింగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వాహన తనిఖీలు

వాజేడు: మండలంలోని దూలాపురం జాతీయ రహదారిపై ఎస్సై వెంకటేశ్వర్‌రావు వాహన తనిఖీలు చేపట్టారు. హైవేపై వచ్చిపోయే ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

పార్టీలో చేరిక..



ములుగు: బీజేపీ యువ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు మాదిరి శ్రీకాంత్ మంగళవారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీ కార్యాలయ ఆవరణంలో జెడ్పీచైర్‌పర్సన్ బడే నాగజ్యోతి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితుడినై బీఆర్‌ఎస్‌లో చేరినట్లు శ్రీకాంత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు కోగిల మహేష్, వేములపల్లి భిక్షపతి, రమేష్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు సమ్మన్న, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

గద్దర్ మృతి తీరనిలోటు



వెంకటాపురం(కె): ప్రజా గాయకుడు గద్దర్ మృతి తీరనిలోటని నేతకాని సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకుడు జాడి ఈశ్వర్ అన్నారు. బెస్తగూడెం పాఠశాలలో విద్యార్థులతో కలిసి నేతకాని సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నివాళులర్పించారు. గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు, విద్యార్థులు దితరులు ఉన్నారు.

చేయూతనిచ్చిన మిత్రులు



ములుగు రూరల్: మండలంలోని జాకారం గ్రామానికి చెందిన చుతుర్వేదుల శ్రీకాంత్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా తోటి మిత్రులు చేయూతనందించారు. ఈ మేరకు మంగళవారం బాధిత కుటుంబానికి రూ. 27,500 అందించారు. 2006–07 సంవత్సరంలో అబ్బాపూర్ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో పదవ తరగతిలో కలిసి చదివిన మిత్రులు సాయం అందించడంతో గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో సంపత్, వెంకటేష్, రఘు, రాధిక, భాగ్య, రాజునాయక్, కుమార్, పూర్ణ, జైపాల్‌రెడ్డి, రాము, నరేష్, శివాజీ, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

పోస్టాఫీస్‌లో జాతీయ జెండాలు..

ఏటూరునాగారం: అజాదీకాఅమృత్ మహోత్సవంలో భాగంగా హర్ ఘర్ తిరంగా 2.0ను పురస్కరించుకొని సబ్ డివిజన్ పరిధిలోని అన్ని తపాలా కార్యాలయాల్లో జాతీయ జెండాలను విక్రయించనున్నట్లు ములుగు పోస్టల్ సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ రామ్మూర్తి మంగళవారం ప్రకటనలో వెల్లడించారు. రూ.25కు జాతీయ జెండాను అందించనున్నట్లు తెలిపారు. ములుగు సబ్ డివిజన్‌లోని ప్రతీ పోస్టల్ కార్యాలయంలో జాతీయ జెండాలు అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. అలాగే ఆన్‌లైన్‌లో కూడా పోస్టల్ సేవలు అందించనున్నట్లు పేర్కొన్నారు.

బారులుదీరిన జనం..



వెంకటాపురం(కె): గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు మండలంలోని వివిధ పంచాయతీల ప్రజలు బారులు తీరారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో గృహలక్ష్మి దరఖాస్తులకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు. గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు భారీగా తరలివచ్చారు. ఈ నెల 10 వ తేదీ వరకే గడువు ఉండడంతో ఈ ఏడాదికి సంబంధించిన కుల, ఆదాయం, నివాసం సర్టిఫికెట్ల జత చేయాలనే నిబంధన లబ్ధిదారులను తీవ్ర ఇబ్బందిలో నెట్టింది. మీసేవ కేంద్రాలు, జిరాక్స్ సెంటర్ల వద్దకు పరుగులు తీస్తున్నారు.

సర్టిఫికెట్ల కోసం సతమతం

'గృహలక్ష్మి'కి మిగిలింది రెండు రోజులే
- మీసేవ, రెవెన్యూ కార్యాలయాల్లో బారులుదీరిన జనం
- దరఖాస్తులను నిరాకరించిన నిర్వాహకులు
- మంగపేటలో మీసేవ నిర్వాహకుల చేతివాటం
- దరఖాస్తులు చేయకుండానే ఇంటిదారి పట్టిన కొందరు



మీసేవ కేంద్రంలో కిక్కిరిసిన దరఖాస్తుదారులు

ఎస్‌ఎస్‌తాడ్వాయి / మంగపేట : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా శ్రీకారం చుట్టిన గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు మరో రెండు రోజులే గడువు ఉంది. సోమవారం ఒకే రోజు వేల సంఖ్యలో కుల, ఆదాయం, నివాసంల కోసం దరఖాస్తులు చేసుకునేందుకు లబ్ధిదారులు తరలిరావడంతో మీసేవ కేంద్రాలు కిక్కిరిశాయి. దీంతో మీసేవ కేంద్రం నిర్వాహకులు ఆన్‌లైన్ చేసేందుకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉదయం నుంచి రాత్రి వరకూ ఆన్‌లైన్ చేస్తున్నా దరఖాస్తులు కుప్పలుగా పెరుకుపోవడంతో మంగళవారం దరఖాస్తులను తీసుకునేందుకు నిర్వాహకులు నిరాకరించారు. దీంతో లబ్ధిదారులు ఆందోళన చెందారు.

బారులుదీరిన లబ్ధిదారులు

గృహలక్ష్మి పథకానికి ఈ ఏడాదికి సంబంధించిన ఆదాయం, కుల, నివాస సర్టిఫికెట్లు దరఖాస్తు ఫాంకు జత చేయాలన్న నిబంధన మేరకు సర్టిఫికెట్ల కోసం మీసేవ కేంద్రాలు, జిరాక్స్ సెంటర్ల వద్ద లబ్ధిదారులు బారులుతీరారు. మీసేవ కేంద్రాల్లో మొదటి రోజు వచ్చిన దరఖాస్తులు పెండింగ్‌లో ఉండడంతో రెండో రోజు దరఖాస్తులు తీసుకునేందుకు నిర్వాహకులు నిరాకరించారు. దీంతో లబ్ధిదారులు మీసేవ కేంద్రాల ముందు పడిగాపులు కాశారు. దరఖాస్తులు తీసుకోవాలని లబ్ధిదారులు ఎగబడడంతో మీసేవ కేంద్రం నిర్వాహకులు షట్టర్ మూసి ఆన్‌లైన్ పనులు చేశారు. జనం జిరాక్స్‌ల కోసం పోటీ పడడంతో కొంత మంది జిరాక్స్ సెంటర్ల నిర్వాహకులు ఒక్కో జిరాక్స్ కాపీకి రూ. 10 దండుకున్నారు.



సంతకాల కోసం క్యూ కట్టిన లబ్ధిదారులు



జనం రద్దీ తట్టుకోలేక షట్టర్ మూస్తున్న మీసేవ కేంద్రం నిర్వాహకుడు

రెవెన్యూ కార్యాలయాల్లో కిటకిట

మీసేవ కేంద్రాల్లో ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకున్న మ్యానువల్ ఫాంలపై రెవెన్యూ అధికారులు ధృవీకరించాల్సి ఉంటుంది. దీంతో మీసేవ నుంచి వచ్చిన మ్యానువల్ ఫాంలు పెద్దమొత్తంలో ఉండడంతో రెవెన్యూ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఒకే రోజు ఇన్ని దరఖాస్తులను ధృవీకరించడం ఎలా సాధ్యమవుతుందంటూ తర్జనభర్జన పడుతున్నారు. గతంలో దరఖాస్తులను వీఆర్వోలు ధృవీకరించేవారు. కానీ ప్రభుత్వం వీఆర్వో వ్యవస్థను రద్దు చేయడంతో ఆర్‌ఐలు ధృవీకరించాల్సి వస్తుంది. ఒక మండలానికి ఇద్దరు ఆర్‌ఐలు ఉండడంతో పెద్ద సంఖ్యలో వచ్చిన దరఖాస్తులను ధృవీకరించడం ఇబ్బందిగా మారిందంటున్నారు. దీంతో పాటు ఇంటర్‌నెట్ సరిగా పనిచేయకపోవడం మరో సమస్యగా మారిందని తెలిపారు. కాగా జిల్లా కలెక్టర్ స్పందించి గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు గడువు పెంచాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

మంగపేట: ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకం కోసం దరఖాస్తు చేసుకునేందుకు మీసేవా కేంద్రాలు, తహసీల్దార్ కార్యాలయం వద్దకు వందల సంఖ్యలో లబ్ధిదారులు తరలి రావడంతో జాతరను తలపిస్తోంది. దీన్ని ఆసరా చేసుకున్న పలు మీసేవ కేంద్రాల నిర్వాహకులు ఒక్కో దరఖాస్తు ఆన్‌లైన్ చేసేందుకు రూ. 45 రుసుము తీసుకోవాల్సి ఉండగా అదనంగా మరో రూ. 35 వసూలు చేస్తున్నారని లబ్ధిదారులు వాపోతున్నారు. ఈ విషయంపై స్వయంగా లబ్ధిదారులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి దరఖాస్తు గడువును పెంచాలని కోరారు.



ఈ ఫొటోలోని వ్యక్తి మండలంలోని కాల్వపల్లి గ్రామానికి చెందిన పుర్రి మధునమ్మ, తాడ్వాయి మండల కేంద్రానికి కాల్వపల్లి 20 కిలో మీటర్ల దూరం ఉంటుంది. గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు వచ్చింది. గృహలక్ష్మి పథకానికి ఈ ఏడాది ఆన్‌లైన్ ద్వారా పొందిన కులం, ఆదాయం, నివాసం పత్రాలు జత చేయాలని తెలుసుకుంది. మీసేవ కేంద్రానికి దరఖాస్తు చేసుకోవడానికి వచ్చింది. కానీ దరఖాస్తు ఎలా చేయాలో తెలియకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంది. ఎవరినీ అడిగినా పట్టించుకునే పరిస్థితి లేకపోవడంతో అక్కడే కూర్చుంది. మీసేవ కేంద్రం వద్ద జనం బారులు తీరడంతో దరఖాస్తు చేయకుండానే ఇంటిదారి పట్టింది.

రూ. 240 తీసుకున్నారు.



మండల కేంద్రంలోని మీసేవ కేంద్రంలో కులం, ఆదాయం, నివాసం ధృవీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్నాను. ఒక్కో దరఖాస్తుకు రూ. 80 చొప్పున మొత్తం రూ. 240 తీసుకున్నారు. అత్యవసరమని లబ్ధిదారుల నుంచి దోపిడి చేస్తున్నారు.

– పిల్లి జయమ్మ, కోమటిపల్లి

చర్యలు తీసుకుంటాం..

దరఖాస్తుదారుడు ఒక్కో దరఖాస్తుకు రూ. 45 మాత్రమే చెల్లించాలి. అంత కంటే ఎక్కువ డబ్బులు అడిగితే వెంటనే ఫిర్యాదు చేయాలి. మీసేవ నిర్వాహకులు అదనంగా డబ్బులు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటాం. ప్రజలను ఇబ్బందులు పెట్టొద్దు.

– దేవేందర్, జిల్లా ఈడీఎం

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పరిశీలిస్తున్న తహసీల్దార్ నాగరాజు

కాటారం: మండలంలోని చింతకాని, ఇబ్రహీంపల్లి, అంకుషాపూర్, మేడిపల్లి, సుందరాజ్‌పేట, కొత్తపల్లి పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ నాగరాజు మంగళవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు, ఫర్నీచర్, ర్యాంప్, మరుగుదొడ్లు తదితర అంశాలపై ఆరా తీశారు. తహసీల్దార్ వెంట ఆర్‌ఐ వెంకన్న, వీఆర్‌ఏ జితేందర్ ఉన్నారు.

విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

మొగుళ్లపల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యాంటీఎ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పలు విషయాలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏహెచ్‌టీయూ కానిస్టేబుల్ ప్రవీణ్, శ్రీనాథ్ మానవ అక్రమ రవాణ, పిల్లలపై జరుగు లైంగిక దాడులు, బాల కార్మిక రవాణ, గంజాయి వంటి మత్తుపానీయాల నివారణ, మహిళలపై జరుగు దాడులు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. తీసుకోవలసిన జాగ్రత్తలు, నివారణ చర్యలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమేష్, ఉపాధ్యాయులు వెంకన్న, విజిత, అనిల్, సురేందర్, చందర్, తదితరులు పాల్గొన్నారు.

మేమున్నామని.. మీకేంకాదని..



వరద బాధితులకు సామగ్రి అందజేస్తున్న సీఐ రాజు, ఎస్సై కృష్ణప్రసాద్, సభ్యులు



కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో..



ఆర్‌ఐటీఐ ఆధ్వర్యంలో..

ఏటూరునాగారం: భారీ వర్షాలు, వరదల కారణంగా సర్వం కోల్పోయిన బాధితులను ఆదుకునేందుకు దాతలు కదిలారు. వివిధ స్వచ్ఛంద సంస్థలు, ట్రస్టులు, బ్యాంక్‌లు మేమున్నామంటూ ముందుకొచ్చాయి. మంగళవారం మండల కేంద్రంలోని గిరిజన భవన్ ఆవరణంలో వరద బాధితులకు నిత్యావసర సరుకులు, వంటపాత్రలు అందించారు.

చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో..

వరద బాధితులకు భూపాలపల్లి చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో మండలంలోని కొండాయి, మల్యాల, దొడ్ల గ్రామాల వరద బాధితులకు నిత్యావసర సరుకులు, వంటపాత్రలను సీఐ మండల రాజు, సీఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ వృశాలి, ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్ అందించారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా అధ్యక్షుడు రామచంద్రం, ఎన్నపురెడ్డి మహేష్‌రెడ్డి, రామగిరి సదానందం, సాంబమూర్తి, అశోక్, సత్యనారాయణ, శ్రీనివాస్, రమేష్, వెంకటేశ్వర్లు, నారాయణ పాల్గొన్నారు.

కెనరాబ్యాంక్ ఆధ్వర్యంలో..

మండలం కొండాయి, మల్యాల గ్రామాల వరద బాధితులకు కెనరా బ్యాంకుకి చెందిన యూనియన్ సభ్యులు మినీ కిచెన్ సెట్లను అందించారు. మండల కేంద్రంలోని వివేకానంద స్కూల్ ఆవరణంలో సుమారు 100 మంది వరద బాధితులకు అందించారు. కెనరా బ్యాంక్ ఎంప్లాయిస్ రాష్ట్ర యూనియన్ కార్యదర్శి మధుసూధన్, బ్యాంక్ ఏజీఎం మాధవి, ఏటూరునాగారం వివేకానంద స్కూల్ కరస్పాండెంట్ ప్రభాకర్, బ్యాంక్ మేనేజర్ భూక్య వీరు, శశిధర్‌సాయిప్రసాద్, వినయ్‌కుమార్, రఘు, జలీల్, తులసి రామ్ పాల్గొన్నారు.

సత్యసాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో..

వరద బాధితులకు భూపాలపల్లి శ్రీసత్యసాయి సేవా సంస్థ సభ్యులు చీరెలు, లుంగీలు, టవల్లు, బకెట్లు, మగ్గులతో పాటు చిన్నారులకు దుస్తులు, ఇతర వస్తువులు అందించారు. ఆ సేవా సంస్థ రాష్ట్ర కో ఆర్డినేటర్లు, భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు, సాయియూత్ సభ్యులతో పాటు ఉమామహేశ్వర రావు, లక్ష్మీనారాయణ, జైపాల్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, పాపయ్య, నారాయణరెడ్డి, సందీప్ పాల్గొన్నారు.

ఆర్‌ఐటీఐ ద్వారా పంపిణీ..

వరద బాదితులకు స్థానిక ఆర్‌ఐటీఐ ప్రిన్సిపాల్, ఉద్యోగులు, స్నేహితుల సాయంతో కొండాయి, మల్యాలలోని 150 మంది బాధితులకు దుస్తులు, దుప్పట్లు, చీరెలు, లుంగీలు, ఇతర సామాగ్రిని అందించారు. ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, ఐటీఐ సూపరింటెంట్ కుమారస్వామి, శ్రీనివాస్, రమేష్, సాదిక్, విక్రమ్, సమ్మయ్య, మూవీస్ కుమార్, పాపారావు, నరేష్, కొండల్, రిజ్వానా, కృష్ణ ప్రసాద్, శ్రీనివాస్, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక శక్తులకు దూరంగా ఉండాలి

వెంకటాపురం(కె): అసాంఘిక శక్తులకు దూరంగా ఉండాలని సీఐ బండారి కుమార్ అన్నారు. మండలంలోని సీతారాంపురం గ్రామంలో ఎస్సై తిరుపతిరావు, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, సివిల్ పోలీసులతో కలిసి మంగళవారం ఆయన కమ్యూనిటీ కాంటాక్టు ప్రోగ్రాం నిర్వహించి గ్రామస్తులతో మాట్లాడారు. గ్రామంలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలు ఉంటే చెప్పాలని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేస్తానని అన్నారు. అలాగే గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీస్‌లకు సమాచారం ఇవ్వాలని సూచించారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పోలీస్‌శాఖ సాయం అందిస్తుందన్నారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సివిల్, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.



వెంకటాపురం(కె) : గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ బండారి కుమార్

వాజేడు: గ్రామంలోకి గుర్తు తెలియని వ్యక్తులు అనుమానితంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్సై వెంకటేశ్వర్‌రావు అన్నారు. మండలంలోని కోయవీరాపురంలో మంగళవారం కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. గ్రామంలోని యువకులు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. మావోయిస్టులకు సహకరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

ఏటూరునాగారం: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని రొయ్యూర్ ప్రాథమిక వైద్యురాలు సుమలత అన్నారు. ఆలకువారిఘణపురం–3 సెంటర్‌లో మంగళవారం ఆరోగ్య మహిళా క్లినిక్ కార్యక్రమాన్ని నిర్వహించి కేసీఆర్ న్యూట్రిషన్ కిట్‌లు అందించారు. డాక్టర్ మౌనిక, హెల్త్ సూపర్‌వైజర్ కమల, ఎన్‌సీడీ స్టాఫ్ నర్సు శ్రీలత, ల్యాబ్ టెక్నీషియన్, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీపీ, నాయకులు

కాటారం: కాటారం మండలంలో నెలకొన్న పట్టా, అసైన్డ్ భూ సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్ నాగరాజును ఎంపీపీ పంతకాని సమ్మయ్య కోరారు. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్‌ను మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో ఎంపీపీ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. మండలంలోని పలు భూ సమస్యలు, తదితర అంశాలపై చర్చించారు. అర్హులైన వారందరికీ ఓటు హక్కు కల్పించడంతో పాటు రాబోవు సార్వత్రిక ఎన్నికలు మండలంలో స్వేచ్ఛాయుత వాతావరణంలో కొనసాగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గృహలక్ష్మి పథకంలో దరఖాస్తు చేసుకునే లబ్ధిదారులకు కుల, నివాస, ఆధాయ ధృవీకరణపత్రాలు, నివాస స్థల పత్రం, తదితర పత్రాల విషయంలో వెసులుబాటు కల్పించేలా కొంత సమయం ఇవ్వాలని తహసీల్దార్‌ను కోరారు. రాజేశ్, లక్ష్మణ్, సద్వలి ఉన్నారు.

గణితంపై మక్కువ పెంచుకోవాలి

వాజేడు: విద్యార్థులు గణితంపై మక్కువ పెంచుకోవాలని జిల్లా మానిటరింగ్ అధికారి బద్ధం సుదర్శన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మంగళవారం తొలిమెట్టు శిక్షణ ముంగిపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయులందరూ తెలుగు, ఆంగ్లం, గణితంలో శిక్షణ తీసుకున్నట్లు తెలిపారు. శిక్షణలో నేర్చుకున్న నైపుణ్యాలు క్షేత్ర స్థాయిలో తరగతి గదిలో విద్యార్థులకు నేర్పించాలని అన్నారు. ఎంఈఓ వెంకటేశ్వర్లు, నోడల్ అధికారి స్వరూప్‌సింగ్, డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్‌లు లావణ్య, మనోహరి, జయేందర్, బాలాజి, సుమన్ పాల్గొన్నారు.



కన్నాయిగూడెం : మాట్లాడుతున్న ఎంఈఓ

కన్నాయిగూడెం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన తొలిమెట్టుతో విద్యార్థుల విద్య మెరుగుపడుతుందని ఎంఈఓ రాజేష్ అన్నారు. మండలంలోని వివిధ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు ఆగస్టు 2 నుంచి 8 వరకు గుర్రేవుల జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో చేపట్టిన తొలిమెట్టు శిక్షణ మంగళవారంతో ముగిసింది. ఎంఈఓ రాజేష్ మాట్లాడారు. తొలిమెట్టుతో విద్యార్థులకు రాయడం, చదవడం మెరుగుపడుతాయని అన్నారు. ఉపాధ్యాయులు శిక్షణలో నేర్చుకున్న విద్యను విద్యార్థులకు సంపూర్ణంగా నేర్పలన్నారు. ప్రధానోపాధ్యాయులు స్వరూప, అంజయ్య, నర్సింహారావు, సుమలత, సురేందర్, సారంగపాణి పాల్గొన్నారు.

మొక్కుబడిగా సర్వసభ్య సమావేశం

కన్నాయిగూడెం: మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రం కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ జనగం సమ్మక్క అధ్యక్షతన ప్రారంభమైన సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా కొనసాగింది. సమావేశానికి అన్ని శాఖల అధికారులు హాజరుగాకపోవడంతో ఎంపీపీ అసహనం వ్యక్తం చేశారు. గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను ఆయా శాఖ అధికారులు చదివివి నిపించారు. మిషన్ భగీరథ, ఆర్‌అండ్‌బీ రోడ్ల నిర్మాణం, చెరువు గండ్ల మరమ్మతుల విషయంలో సర్పంచ్‌లు సంబంధితశాఖ అధికారులపై మండిపడ్డారు. వివిధ సమస్యలను వైస్ ఎంపీపీ భాస్కర్ సభా దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడారు. వివిధ శాఖల అధికారులు ఇన్‌చార్జ్‌లుగా ఉన్నారని, రెగ్యులర్ అధికారులను నియమించాలని ప్రభుత్వాన్ని కోరుతామన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ పనిచంద్ర, ఎంపీఓ, తహసీల్దార్, సలీం, రామకృష్ణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యదర్శులు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ జనగం సమ్మక్క

'గృహలక్ష్మి' దరఖాస్తు గడువు పెంచాలి

మల్హర్(మహాముత్తారం): గృహలక్ష్మి పథకానికి సంబంధించిన దరఖాస్తుల గడువుని పెంచాలని బహుజనసమాజ్(బీఎస్పీ)పార్టీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మహాముత్తారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాస్‌కు బీఎస్పీ నాయకులు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గృహలక్ష్మి దరఖాస్తు గడువు తక్కువగా ఉందన్నారు. దీంతో చాలా మంది లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోలేక పోతున్నారని వెల్లడించారు. ఈ కార్యక్రంంలో బీఎస్పీ యువజన నాయకులు గుండు ధర్మా తదితరులు పాల్గొన్నారు.

కాటారం: ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకం దరఖాస్తు గడువు తేదీని పెంచాలని ప్రజా సంఘాల నాయకుడు పీక కిరణ్, బీఎస్పీ మండల కన్వీనర్ బొడ్డు రాజబాబు మంగళవారం వేర్వేరు ప్రకటనల్లో కోరారు. రెండో సారి అధికారంలోకి వస్తే నిరుపేదలకు సొంత స్థలంలో ఇళ్లు నిర్మించుకోవడానికి రూ.5లక్షలు ఇస్తామని మేనోఫెస్టోలో పెట్టిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం గృహలక్ష్మి పేరిట రూ.3లక్షలకే పరిమితం చేయడం శోచనీయం అన్నారు.



మహాముత్తారంలో తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

హెచ్‌ఐవీపై అవగాహన అవసరం

ములుగు: హెచ్‌ఐవీ ఎయిడ్స్‌పై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా టీబీ, హెచ్‌ఐవీ, లెప్రసీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ పోరిక రవీందర్ అన్నారు. ఈ మేరకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యూత్ ఫస్ట్ 2003 కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన రేస్ అగెనెస్టు, హెచ్‌ఐవీ రెడ్‌రన్ కార్యక్రమానికి ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లేషం, ఎన్‌ఎస్‌ఎస్ జిల్లా అధికారి డాక్టర్ సమ్మయ్య ప్రోగ్రాం ఆఫీసర్ యుగేందర్‌తో కలిసి మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో హెచ్‌ఐవీ వేగంగా వ్యాపిస్తుందన్నారు. విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. హెచ్‌ఐవీని నిర్మూలించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఐసీటీసీ కౌన్సిలర్ కుమార్‌సింగ్, మారి స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు మేనేజర్ సదానందం, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.



విద్యార్థులకు నీటి కష్టాలు



ములుగు రూరల్: మండలంలోని మల్లంపల్లి ప్రభుత్వ పాఠశాలలో నీటి సౌకర్యం లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలో చేతిపంపు లేకపోగా, మిషన్ భగీరథ నీరు కూడా రావడం లేదు. మంగళవారం విద్యార్థులు పాఠశాల నుంచి బయటకెళ్లి వీధిలోని చేతిపంపు వద్ద ప్లేట్లు శుభ్రపర్చుకున్నారు. పాఠశాలకు మిషన్ భగీరథ నీటిని పంచాయితీ అధికారులు సరఫరా చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని తల్లితండ్రులు ఆరోపిస్తున్నారు. ఉన్నాతాధికారులు స్పందించి నీటి సౌకర్యం కల్పించాని కోరుతున్నారు.